
స్వాహా సంఘాలు!


కదిరి, సెప్టెంబరు 24: కరువు రైతుకు బాసటగా నిలవాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(సొసైటీ)లు.. స్వాహా సంఘాలుగా మారాయి. రైతుల సొమ్మునే కాజేశాయి. గత వైసీపీ పాలనలో సొసైటీలను ఆపార్టీ నాయకులు తమ జేబు సంస్థలుగా మార్చుకున్నారు. యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. రైతులు చెల్లించిన సొమ్మును బ్యాంకుకు జమ చేయకుండా మింగేశారు. అడ్డదిడ్డంగా నియామకాలు చేపట్టారు. నోటిఫికేషన్ విడుదల చేయకుండా గుట్టుచప్పుడు కాకుండా రూ.లక్షల్లో వసూలు చేసి, ఉద్యోగాలు కట్టబెట్టారు. గత ప్రభుత్వంలో అప్పటి సొసైటీల చైర్మెన్, ఉద్యోగులు కలిసి స్వాహాపర్వం సాగించినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ఏడీసీసీ బ్యాంకు కదిరి శాఖ



రైతుల సొమ్ము రూ.కోటి పక్కదారి

- సొసైటీల్లో అవినీతి లెక్కలు
- అడ్డదిడ్డంగా నియామకాలు
- గత ప్రభుత్వంలో చక్రంతిప్పిన వైసీపీ నాయకులు




రూ.కోటి కొట్టేశారు..!

కరువు జిల్లా రైతులు బ్యాంకు రుణాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తారు. రుణాల చెల్లింపు, రెన్యూవల్‌లో రైతులు నిర్లక్ష్యం చేయరు. ఎన్ని తిప్పలు పడైనా సరే.. రెన్యూవల్ చేసుకుంటుంటారు. ఎన్నో ఇబ్బందులు పడి రైతులు పంటరుణాలను బ్యాంకులకు చెల్లిస్తుంటే కొంతమంది ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు కలిసి ఆ డబ్బు స్వాహాచేసిన ఉదంతం ఇటీవలే వెలుగుచూసింది. ఏడీసీసీ బ్యాంకు కదిరి శాఖ పరిధిలో ఉన్న నాలుగైదు సొసైటీల్లో రూ.కోటి వరకు స్వాహా చేసినట్లు సమాచారం. ఇది జరిగి రెండేళ్లవుతున్నా బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్త పడినట్లు సమాచారం. రుణాలు తీసుకున్న రైతులు వడ్డీసహా చెల్లించి మరో బ్యాంకుకు వెళ్తున్నారు. సహకార సొసైటీలో రుణం చెల్లించాల్సి ఉందనీ, దీంతో తాము ఇవ్వలేమని వారు చెబుతుండడంతో ఖంగుతింటున్నారు. నిధుల స్వాహాపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అవినీతి లెక్కలు

ప్రభుత్వ రంగ బ్యాంకులో వ్యవసాయ రుణాలు ఇవ్వడం, వాటిని తిరిగి కట్టించుకోవడం సర్వసాధారణమే. రైతులకు చేదోడువాదోడుగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకార పరపతి సంఘాలను పలు మేజర్ పంచాయతీలు, మండలకేంద్రాల్లో ఏర్పాటు చేసింది. వాటి ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేస్తోంది. ఆ రుణాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రైతులకు సొసైటీలు శాపంగా మారాయి. ఏడీసీసీ కదిరి శాఖ పరిధిలో గాండ్లపెంట, నంబులపూలకుంట, ఎస్ మొలకలపల్లి, సైదాపురం, మల్లయ్యగారిపల్లి, గొల్లోలచెరువు సొసైటీలున్నాయి. వీటి పరిధిలో రైతులకు రుణాలిచ్చారు. రైతులు కూడా క్రమం తప్పకుండా వాటిని తిరిగి చెల్లిస్తున్నారు. కొన్ని సొసైటీల్లో రైతులు కట్టిన రుణాల డబ్బును బ్యాంకుకు జమ చేయకుండా స్వాహాచేసినట్లు సమాచారం. ఇలా రూ.కోటిదాకా కొట్టేసినట్లు తెలుస్తోంది.

ఇప్పటికే రైతుల ఫిర్యాదుతో బ్యాంకు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. రెండేళ్ల క్రితం ఎస్ మొలకలపల్లి సొసైటీలో రూ.32లక్షలు అక్రమాలు జరిగినట్లు అధికారులు తేల్చారు. నంబులపూలకుకుంట సొసైటీలో రూ.28లక్షలు స్వాహా చేసినట్లు సమాచారం. ఈ మొత్తం మరింత ఎక్కువగా ఉండొచ్చని రైతులు అంటున్నారు. మల్లయ్యగారిపల్లి సొసైటీలో రూ.8లక్షల వరకు స్వాహా జరిగినట్లు తెలుస్తోంది. గొల్లోలచెరువు, సైదాపురం సొసైటీల్లో ఎంత మాత్రం స్వాహా జరిగిందో బయటకు రాలేదు. రైతు రుణాలు రూ.70లక్షలకుపైగా స్వాహా అయినట్లు సమాచారం. విచారణ చేస్తే మరింత ఎక్కువ మొత్తంలో బయటపడే అవకాశం ఉన్నట్లు రైతులు అంటున్నారు. ఈమొత్తాన్ని గడిచిన ఐదేళ్లలో అధ్యక్షులుగా ఉన్నవారు, ఉద్యోగులు కలిసి స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి.



కనిపించని కార్యాలయాలు

ఏ గ్రామం, మండలానికి సంబంధించి సొసైటీ కార్యాలయం అక్కడే ఉండాలి. నంబులపూలకుంట, గొల్లోలచెరువు, ఎస్. మొలకలపల్లి, మల్లయ్యగారిపల్లి సొసైటీ కార్యాలయాలన్నీ కదిరిలోనే ఉన్నాయి. మండల కేంద్రాల్లో కాకుండా సొసైటీలు కదిరిలో నిర్వహించడంతో రైతులు కార్యాలయాలకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రం నుంచి అంతదూరం కదిరికి వచ్చి తమ పనులు చూసుకుని వెళ్లాలంటే ఇబ్బందిగా ఉన్నట్లు చెబుతున్నారు.

వైసీపీ నాయకుల హస్తం

సొసైటీల్లో అక్రమాల వ్యవహారంలో ఉద్యోగులతోపాటు అప్పటి అధికార పార్టీ నాయకుల భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది. ఇంత పెద్దఎత్తున అవినీతి జరిగినా బయటకు పొక్కకుండా తొక్కిపెట్టినట్లు సమాచారం. గత పాలకుల హస్తం ఉండడంతోనే ఈస్వాహా పర్వం బయటకు రానివ్వకుండా చేసినట్లు తెలుస్తోంది.

ఇష్టారాజ్యంగా నియామకాలు

బ్యాంకులో ఉద్యోగం రావాలంటే సంవత్సరాల తరబడి సాధన చేసి, తరువాత పరీక్షలు రాసి, అర్హత సాధించాల్సి ఉంటుంది. సహకార సొసైటీల్లో మాత్రం సులువుగా ఉద్యోగం వస్తుందని తెలిసింది. 8 మందికి నేరుగా సొసైటీల్లో ఉద్యోగం కట్టబెట్టినట్లు సమాచారం. వీరందరూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగాల్లో చేరినట్లు రికార్డులు చెబుతున్నాయి. 8 నెలలుగా వీరికి జీతాలు కూడా చెల్లిస్తున్నట్లు తెలిసింది. వీరిలో ఒక్కొక్కరి నుంచి రూ.10లక్షల వరకు అధికారులు, అధ్యక్షులకు ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బు తీసుకుని నోటిఫికేషన్ లేకుండా నేరుగా నియామకం చేపట్టినట్లు సమాచారం.



ఎన్పీకుంట సొసైటీ కార్యాలయం

భూమి అమ్మి రుణం చెల్లించా..

భూమిని అమ్మి, బ్యాంకులో అప్పు చెల్లించా. సొసైటీ అధికారులు డబ్బు తీసుకుని, అప్పునకు జమ వేయలేదు. పోలీసు స్టేషన్ వరకు వెళ్లడంతో పంచాయితీ చేసి, డిసెంబరు నాటికి తన అప్పును మాఫీ చేస్తామని ఉద్యోగి బంధువులు గడువు తీసుకున్నారు.



- రాజగోపాల్‌రెడ్డి, రైతు, ఎర్రవంకలవారి పల్లి, నంబులపూలకుంట మండలం

విచారణ చేపడతాం

కదిరి ఏడీసీసీ బ్యాంకు పరిధిలోని సొసైటీల్లో రైతు రుణాల సొమ్ము స్వాహా చేసినట్లు మాదృష్టికి వచ్చింది. ఎస్. మొకలపల్లిలో విచారణ చేశాం. రూ.32లక్షలు అవినీతి జరిగినట్లు తేల్చాం. నంబులపూల కుంటలో కూడా అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. వాటిపైకూడా విచారణ చేస్తాం. రికార్డుల కంప్యూటరీకరణ పూర్తయిన వెంటనే విచారణ కొనసాగిస్తాం. ఆరు నెలల్లోగా నివేదిక అందిస్తాం.

- కృష్ణానాయక్, జిల్లా సహకార అధికారి

పదవుల సంబరం

- జిల్లాకు మూడు నామినేటెడ్ పోస్టులు
- కూటమి శ్రేణుల హర్షాతిరేకాలు



కమతం కాటమయ్య, గోనుగుంట్ల విజయ్‌కుమార్, కాలేనాయక్

ధర్మవరం/పుట్టపర్తి, సెప్టెంబరు 24: కూటమి నాయకులు ఎదురుచూస్తున్న రోజు రానేవచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను మంగళవారం ప్రకటించింది. తొలి జాబితాలో ముగ్గురు జిల్లావాసులకు పదవులు దక్కాయి. దీంతో జిల్లావాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ధర్మవరానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గోనుగుంట్ల విజయ్‌కుమార్‌ను ఏపీ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేశారు. మరో సీనియర్ నేత కమతం కాటమయ్యకు సీడ్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించారు. వీరిద్దరు పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నారు. కమతం కాటమయ్య టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా, పలు జిల్లాలకు ఇన్‌చార్జిగా కూడా వ్యవహరించారు. గోనుగుంట్ల విజయ్‌కుమార్ కూడా రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. విజయ్‌కుమార్ తండ్రి వెంకటరెడ్డి, తల్లి జయమ్మ ఎమ్మెల్యేలుగా పనిచేశారు. విజయ్‌కుమార్ పార్టీకి విధేయుడిగా ఉంటూ పరిటాల కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా మెలుగుతూ వస్తున్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో సైతం విజయ్‌కుమార్, కమతం కాటమయ్య పార్టీ విజయం కోసం పనిచేశారు. అమడగూరు మండలం మలకవారిపల్లి తండాకి చెందిన కాలేనాయక్‌ను రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ సభ్యుడిగా నియమించారు. ఈయన దీర్ఘకాలికంగా పార్టీకి సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పదవి దక్కింది.

కేతిరెడ్డిపై కేసు

ధర్మవరం ఘర్షణపై చర్యలు

ధర్మవరం, సెప్టెంబరు 24: పట్టణంలో సోమవారం బీజేపీ, వైసీపీ నాయకుల మధ్య ఘర్షణకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బీజేపీ కార్యకర్త ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేతిరెడ్డితోపాటు వైసీపీకి చెందిన జడ్పీ వైస్‌చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి, రావులచెరువు ప్రతాప్‌రెడ్డి, చిగిచెర్ల శ్రీనివాస రెడ్డి, రంగారెడ్డి, మహమ్మద్ రఫీ, విజయ్, డేరంగుల అంజి, డ్రైవర్ రామాంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వైసీపీ కార్యకర్త అమర్‌నాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు బీజేపీ నాయకులు డోలా రాజారెడ్డి, హరీశ్, ప్రవీణ్‌కుమార్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పలుచోట్ల వర్షం

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 24: జిల్లాలోని పలుచోట్ల సోమవారం రాత్రి వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు ప్రకటనలో తెలిపారు. అత్యధికంగా గోరంట్లలో 64.2 మి.మీ. కురిసింది. బుక్కపట్నం 35.4, పుట్టపర్తి 24.2, హిందూపురం 22.4, కొత్తచెరువు 21.4, గుడిబండ 21.0, పరిగి 15.6, లేపాక్షిలో 11.2 మి.మీ, వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు పేర్కొన్నారు.

వేరుశనగ, కందిలో తెగుళ్లను నివారించుకోండి

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 24: ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ, కంది పంటల్లో తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని రైతుశిక్షణ కేంద్రం ఏడీ విద్యావతి.. రైతులకు సూచించారు. మండలంలోని గొట్లూరు, నాగలూరు గ్రామాలకు చెందిన చెన్నప్ప, సూర్యనారాయణ రైతులు సాగుచేసిన వేరుశనగ, కంది, వరి పంటలను ఏడీ పరిశీలించారు. ఏడీ మాట్లాడుతూ.. వేరుశనగ పూతదశలో ఉందనీ, ఎకరాకు నాలుగు బస్తాల జిప్సం వేసుకోవాలన్నారు. కందిపంట పూతదశకు చేరుకుందనీ, పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ గ్రాము.. లీటర్ నీటికి కలుపుకుని పిచికారీ చేసుకోవాలని సూచించారు. వరికి ఆకుముడత తెగులు సోకిందనీ, నివారణకు మందులు పిచికారీ చేయాలన్నారు. వేరుశనగ సాగుచేసి 2నెలలు పూర్తవడంతో దిగుబడి వచ్చేందుకు మెలకువలు తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం ఏడీఏ క్రిష్టయ్య, ఏఓ ముస్తఫా, రైతులు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంపద సృష్టిస్తున్న చంద్రబాబు

బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

గోరంట్ల, సెప్టెంబరు 24: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంపద సృష్టించడం ద్వారా వందరోజుల్లో అభివృద్ధి చేసి చూపించారని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలో పలు కార్యక్రమాల్లో మంత్రి సవిత.. ఎంపీ బీకే పార్థసారథి మంగళవారం పాల్గొన్నారు. మొదట మంత్రి సవిత మల్లాపల్లిలో ఉన్నత పాఠశాల విద్యార్థినులకు 22 సైకిళ్లు, దుస్తులు అందించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం పాపారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఆయనపై మూర్ఖుడైన జగన్ లేనిపోని విమర్శలు చేస్తున్నాడన్నారు. పెనుకొండ నియోజకవర్గానికి ఉపాధి పథకం కింద రూ.37కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. గోరంట్ల పెద్ద మండలం కావడంతో రూ.6కోట్లు కేటాయించామన్నారు. కొత్త పింఛన్లు అక్టోబరులో ఇస్తామన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ.. జగన్ దుర్మార్గపు పాలనకు ప్రజలు గుర్తుండిపోయే తీర్పు ఇచ్చారన్నారు. తాము కూడా నిబద్ధతతో పనిచేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా, ఏడీ అల్తాఫ్ అలీఖాన్, టీడీపీ నాయకులు సోమశేఖర్, దేవా నరసింహప్ప, అశ్వత్థరెడ్డి పాల్గొన్నారు.

లడ్డూ కల్తీ దోషులను కఠినంగా శిక్షించాలి

హిందూసంఘాల డిమాండ్

పురంలో భారీ ర్యాలీ



హిందూసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 24: ప్రపంచ ప్రసిద్ధిచెందిన తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూను అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని హిందూసంఘాలు డిమాండ్ చేశాయి. పట్టణంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించాయి. తొలుత చిన్న మార్కెట్ వేణుగోపాలస్వామి దేవాలయం నుంచి పేట వేంకటరమణస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ 108 టెంకాయలు కొట్టి, పాపులను శిక్షించాలని దేవదేవుడిని వేడుకున్నారు. అనంతరం మెయిన్‌బజార్, గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. అక్కడే కూర్చుని భజనలు, కీర్తనలు ఆలపించారు. అనంతరం సద్భావన సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ గురుస్వామికి వినతిపత్రం అందించారు. ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ.. హిందువులు పవిత్రంగా భావించే లడ్డూప్రసాదంలో ఆవు, పంది కొవ్వు కలపడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. కల్తీకి కారకులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో గోవధ శాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే హిందువులు తీసుకునే చర్యలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఐక్యవేదిక నేతల గోవింద నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.

ఇసుకాసురుల బరితెగింపు

నడిరోడ్డుపై తన్నుకున్న వైనం

ఇసుక ఫైట్

నడిరోడ్డుపై గొడవకు దిగిన ఇసుక దళారులను చెదరగొడుతున్న పోలీసులు





పుట్టపర్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'నదిలోకి రండి తేల్చుకుందాం' అని ఓ వర్గం సవాల్ విసిరింది. 'వచ్చేదే.. చూద్దాం ఏం చేసుకుంటారో..' అంటూ మరో వర్గం ప్రతిసవాల్ విసిరింది. ఇలా.. ఇసుకాసురులు ఏకంగా జిల్లాకేంద్రంలో అదీ.. నడిరోడ్డులో తన్నుకున్నారు. రాష్ట్రప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టినా అక్రమ రవాణాకు మాత్రం అడ్డుకట్ట పడట్లేదు. తమ గ్రామ పరిధిలోని నది పరీవాహకంలో తామే ఇసుక రవాణా చేసుకోవాలనీ, ఇతర గ్రామాల ట్రాక్టర్లు రానీయమంటూ తెగేసి చెబుతున్నారు. తాము వచ్చేదేనని ఇతర గ్రామాలవారు సై అంటున్నారు. దీంతో పుట్టపర్తిలో రెండు గ్రామాల ఇసుకాసురులు మంగళవారం నడ్డిరోడ్డుపై తన్నుకున్నారు. పోలీసుల రంగప్రవేశంతో సమస్య సద్దుమనిగినా.. నివురుగప్పిన నిప్పులా ఉంది. జిల్లా కేంద్రం పుట్టపర్తి పక్కనే చిత్రావతి నది ప్రవహిస్తోంది. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు చిత్రావతిలో ఇసుకను లూటీ చేసి, రూ.వందల కోట్లు కొల్లగొట్టారు. ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చింది. జిల్లా కేంద్రం సమీపాన చిత్రావతి నది పరీవాహకంలో ఇసుక రీచ్‌గానీ, డంప్‌గానీ లేదు. దీనిని అదునుగా మలచుకుని ఇసుక దందా సాగించేందుకు కొందరు కూటమి నాయకులు పథకం పన్నారు. గత వైసీపీ హయాంలో ఇసుక అక్రమ రవాణా చేసినవారితో చేతులు కలిపారు. యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుట్టపర్తి, కోవెలగుట్లపల్లి, ఎనుములపల్లి, రాయలవారిపల్లి గ్రామాల సమీపాన చిత్రావతి నదిలో ఇసుక వ్యాపారానికి తెరలేపారు. ఇటీవలిగా రాత్రింబవళ్లు చిత్రావతి నుంచి వందల ట్రాక్టర్లతో ఇసుక తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంలో కొన్నిరోజులుగా ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి ఇసుక దళారుల మధ్య వార్ నడుస్తోంది. ఈనేపథ్యంలో చిత్రావతి నుంచి ఎనుములపల్లికి చెందిన ఇసుక దళారులు ట్రాక్టర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ప్రశాంతి గ్రామం వద్దకు తోలారు. తమ గ్రామాల పరిధిలో ఇసుక ఎలా తోలుతారంటూ బ్రాహ్మణపల్లి దళారులు అడ్డుకుని, పోలీసులకు పట్టించినట్లు తెలుస్తోంది. ఈవివాదం ఘర్షణకు దారితీసింది. రెండు గ్రామాల ఇసుకాసురులు ప్రశాంతి గ్రామం-పుట్టపర్తి బైపాస్ రోడ్డులో పోలీసు పరేడ్ మైదానం సమీపాన నడిరోడ్డుపై గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇదిచూచిన జనం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకొస్తే.. దళారులు రోడ్డుపై తన్నుకోవడం ఏంటి అని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం పక్కనే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా.. అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది. నడిరోడ్డుపై గొడవకు దిగిన ఇరుగ్రామాల దళారులను పుట్టపర్తి అర్బన్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి, హెచ్చరించారు. చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని పుట్టపర్తి అర్బన్ సీఐ సునీత హెచ్చరించారు.



పుట్టపర్తి అర్బన్ పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

దరఖాస్తులు పెంచండి

కొత్తచెరువు, సెప్టెంబరు 24: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇన్‌స్పైర్ మానక్‌కు దరఖాస్తు చేసుకునేలా సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని డీఈఓ మీనాక్షి మంగళవారం ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 15వతేదీ వరకు దరఖాస్తుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇన్‌స్పైర్ మానక్ నామినేషన్లు వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సమస్యలుంటే జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్‌కు 9492843184 నంబరులో సంప్రదించాలన్నారు.



మన బాలుడే..!

సినీ పరిశ్రమలో మూడు తరాలకు గాత్ర దానం చేసిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం గతించి నాలుగేళ్లు అయినా ఆయన పాడిన పాటలు అజరామరం. బుధవారం ఆయన వర్ధంతి. అనంత జేఎన్‌టీయూ విద్యార్థిగా, గాన గంధర్వుడిగా ఆయనకు జిల్లాతో మంచి అనుబంధం ఉంది.

- జేఎన్‌టీయూ విద్యార్థిగా జిల్లాతో అనుబంధం
- గాన గంధర్వుడిగా పలుమార్లు సత్కారం
- 2008లో అనంతవాసులచే భారీ ఊరేగింపు
- అనంతతో ఆత్మీయ అనుబంధం
- నేడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి

ఆయన గాత్రంలో
అక్షరాలు అలలై పొంగుతాయి
పాట గజ్జెకట్టి ఆడుతుంది.
సరిగమలు సంతసంతో
మురిసి నర్తిస్తాయి.
అమృతతుల్యమైన ఆ కరంలో
గోదావరి కూడా వేదంలా ఘోషిస్తుంది.
పాటల జగతి
పగలే వెన్నెలాయే అంటూ పరవశిస్తుంది.
మాటేరాని చిన్నది సైతం
ఓ పాపా లాలీ అంటూ లాలిస్తుంది
'బాలు' చంద్రుడిలా ఉదయించి
నవమినాటి వెన్నెలలా అగుపించి
ఆకుచాటు పిందెను చూపించి
నిండు ఆకాశమంత సంగీతానికి
పున్నమి వెన్నెలతో
స్వరాభిషేకం చేసిన గాన గంధర్వుడు ఆయన
శంకరుడికి నాగాభరణంలా
సంగీత జగత్తులో పండితులకు
ఆరాధ్యుడయ్యాడు
ఆగిపోని కాలానికి స్వాగతం అంటూ
పాటకు ప్రాణ ప్రతిష్ఠ చేసిన ఆ గళం
కరోనా కాటుకు మూగబోయింది.
సినీ సంగీతం చిన్నబోయింది.
తన పెన్నిధిలేదని పాట
మాటరాని మౌనమిది అంటూ రోదించింది.
గత గాత్రాన్ని నెమరు
వేసుకుంటూ సాంత్వన పొందింది.

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 24: సినీ సంగీత చరిత్రలో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్న గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. అన్ని భాషలలో కలిపి 40వేలకు పైగా పాటలు పాడి భేష్ అనిపించుకున్న ఘనాపాటి ఆయన. కళామతల్లి ముద్దు బిడ్డగా ఆయన సంగీత ప్రయాణం శిఖర సమానం. నాలుగు దశాబ్దాలపాటు తన గానమాధుర్యంతో పాటల ప్రేమికులను ఓలలాడించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు అనంతపురం జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉంది. విద్యార్థిదశలో 1962లో అప్పట్లో నాగార్జున యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల(ప్రస్తుత జేఎన్‌టీయూ)లో మెకానికల్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదివారు. తర్వాత నెల్లూరుకు వెళ్లిపోయారు. ఇదే జేఎన్‌టీయూ నుంచి నాలుగో డాక్టరేట్‌ను సైతం ఎస్పీ బాలు అందుకున్నారు. జేఎన్‌టీయూలో చదువుకుంటున్న సమయంలోనే గూడూరులో కాళిదాసు కళానికేతన్ సంస్థ నిర్వహించిన లలిత సంగీత పోటీల్లో బాలు రెండో బహుమతిని అందుకున్నారు. ఆ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన ప్రఖ్యాత గాయని ఎస్.జానకి... ఎస్పీ బాలును పిలిచి 'నీకు మంచి భవిష్యత్తు ఉంది. మద్రాస్ వచ్చెయ్' అని సూచించారు. అతడి ప్రతిభకు ఆమె దీవెనలు తోడవడంతో అనతికాలంలోనే సినీ సంగత ప్రపంచలోకి అడుగుపెట్టి స్థిరపడ్డారు. అనంతరం కాలంలో 1970లో కళాశాల వార్షికోత్సవానికి వచ్చిన ఆయన దివినుంచి భువికి దిగివచ్చి అనే పాటను పాడి అందరి మన్ననలు పొందారు. 2008 జూన్ 29న త్యాగరాజ సంగీతసభ స్వర్ణోత్సవాల్లో పాల్గొనేందుకు అనంతపురం వచ్చారు. అప్పట్లో త్యాగరాజ సభ స్వర్ణోత్సవాల నిర్వాహకుడు దాసరి హరిశ్చంద్ర రామ ఆధ్వర్యంలో ఎస్పీ బాలును నగరంలో ఊరేగించడంతోపాటు సంగీత సభ తరపున బంగారు ఉంగరాన్ని బహుకరించి ఘనంగా సత్కరించారు. ఇదే కార్యక్రమంలో పడమటి సంధ్యారాగం సినిమాలోని 'పిబరే రామరసం' పాటను ఆలపించి సంగీతాభిమానులను అలరించారు. 2014 ఆగస్టులో జిల్లాకేంద్రంలోని ఓ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన పాడుతా తీయగా కార్యక్రమానికి ఎస్పీ బాలు హాజరై తన గాత్రంతో సంగీతాభిమానులను రంజింపజేశారు. తర్వాత 2015 జనవరి 11న జేఎన్‌టీయూ ఆవరణలో నిర్వహించిన స్వరాభిషేకం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా తన విద్యార్థిదశలో అనంతపురంలోని జేఎన్‌టీయూలో గడిపిన కాలాన్ని గుర్తుచేసుకుని వీక్షకులతో ఆ మధురజ్ఞాపకాలను పంచుకున్నారు. ఇలా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు అనంత జిల్లాతో అమూల్యమైన అనుబంధం ఉంది.



అనంతలో ఎస్పీ బాలు ఊరేగింపు (ఫైల్)



త్యాగరాజ సంగీత సభ స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం


నేటితరం గాయకులకు ఆదర్శం

- హరిశ్చంద్రరామ, త్యాగరాజ సంగీతసభ స్వర్ణోత్సవాల నిర్వహణ కమిటీ చైర్మన్



2008లో త్యాగరాజ సంగీతసభకు సంబంధించి వారం రోజులపాటు గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించాము. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం హాజరయ్యారు. అందరితో కలివిడిగా గడిపారు. నేటితరం గాయకులకు ఎస్పీ బాలు ఆదర్శం. పెద్దదిక్కుగా సంగీతంలో ఎన్నో సూచనలు, సలహాలందించేవారు.

మరపురాని స్వరం ఎస్పీ బాలు : ఏలూరు యంగన్న, జనప్రియ కవి



1996 జనవరిలో నెల్లూరు సెంటర్‌లో విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతోపాటు నేను పాల్గొన్నాను. ఆ సమయంలో నేను పద్యం పాడిన తీరును గమనించి, ఎస్పీ బాలు నాతో కరచాలనం చేస్తూ నన్ను అభినందించడం నా జీవితంలో మరుపురాని మధుర జ్ఞాపకం. తెలుగువారికి ఆయన కమ్మని స్వరం. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం భౌతికంగా దూరమై నాలుగు సంవత్సరాలవుతున్నా ఆయన స్వరం ప్రజల మదిలో వినిపిస్తూనే ఉంది. జేఎన్‌టీయూఏ ఉద్దీపన గీతంను నేను రాయగా ఎస్పీ బాలు గానం చేయడం అదృష్టంగా భావిస్తున్నాను.

ఆదరణ చూపేవారు: ఓబులదాస్, అధ్యక్షుడు, పాతపాటల ప్రేమికుల కల్చరల్ అసోసియేషన్



కళాకారులన్నా... కళాభిమానులన్నా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎంతో ఆదరణ చూపేవారు. 2017 డిసెంబరు 24న హైదరాబాద్‌లో సారథి స్టుడియోస్‌లో పాతపాటల ప్రేమికుల కల్చరల్ అసోసియేషన్‌ను బాలు చేతులమీదుగా ప్రారంభించారు. అదే సందర్భంగా అంధురాలైన లక్ష్మీ అనే గాయకురాలికి బాలు చేతులమీదుగా రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. చిన్నప్పటినుంచి ఆయన పాటలను వింటున్నాం. మా అసోసియేషన్ కార్యక్రమాల నేపథ్యంలో మూడుసార్లు ఆయనను కలిసాం. ఎప్పుడు కలిసినా చాలా ఆప్యాయంగా మాట్లాడించేవారు.

ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం

డీఆర్‌డీఏ-వెలుగు ఏసీ పోస్టులు ఖాళీ

డీపీఎం, ఏపీఎం, సీసీల బదిలీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24 : డీఆర్‌డీఏ-వెలుగు ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం నెలకొంది. క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ల పోస్టులను ఖాళీగా ఉంచి అక్కడ పనిచేస్తున్న ఏసీలను పీడీ కార్యాలయానికి బదిలీ చేశారు. రాయదుర్గం క్లస్టర్ ఏసీ గంగాధర్ సుమారు ఏడేళ్లుగా అక్కడే పనిచేస్తున్నారు. ప్రస్తుతం బదిలీల్లో పీడీ కార్యాలయానికి పంపారు. తిరిగి ఆయనకే రాయదుర్గం ఏసీ ఇన్‌చార్జి ఇవ్వాలని చూస్తున్నారు. ఇక కళ్యాణదుర్గం ఏసీ రాధారాణి సుమారు ఐదేళ్లకు పైగా అక్కడే పనిచేస్తున్నారు. ప్రస్తుత బదిలీల్లో పీడీ కార్యాలయానికి వేశారు. తిరిగి కళ్యాణదుర్గం ఏసీ ఇన్‌చార్జి ఇవ్వాలని యత్నిస్తున్నారు. మరో డీపీఎం రవీంద్రబాబు ఉరవకొండ ఏసీగా పనిచేస్తూ, పీడీ కార్యాలయంలో ఇన్‌చార్జిగా చేస్తున్నారు. తాజా బదిలీల్లో పీడీ కార్యాలయానికి పంపినా ఎప్పటి నుంచో ఇక్కడే పనిచేస్తున్నారు. డీపీఎం ఎంకే సత్యనారాయణ చేయూత ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఆయన్ను ధర్మవరం ఏసీగా బదిలీ చేశారు. తాడిపత్రి క్లస్టర్ ఏసీగా పనిచేస్తున్న రాజ్యలక్ష్మిని పామిడి క్లస్టర్‌కు బదిలీ చేశారు. అనంతపురం జిల్లాలో నలుగురు డీపీఎంలు, ఏపీఎంలు 32 మందిని, సీసీలు 60మంది బదిలీచేశారు. బదిలీలు చేసినా వాళ్లే...చేయకపోయినా వాళ్లే అనే చందంగా మారింది. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ కార్యాలయంలో సుమారు నాలుగైదేళ్లుగా పనిచేస్తున్న డీపీఎంలు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏరియా కోఆర్డినేటర్లు బదిలీ పేరుతో పీడీ కార్యాలయానికి పంపారు. పీడీ కార్యాలయంలో ఇదివరకు పనిచేసే సబ్జెక్ట్‌లను తీసుకుని తిరిగి అదే క్లస్టర్లకు ఇన్‌చార్జిలుగా కొనసాగాలను యత్నిస్తున్నట్లు సమాచారం. ఏపీఎంలలో కొందరిని ఇన్‌చార్జి ఏసీలుగా నియమించాలనే ఉద్దేశ్యంతో ఆయా క్లస్టర్లలోనే ఉంచారు. ఆరుగురు ఏపీఎంలను ఇక్కడ నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు పంపగా, అక్కడి నుంచి ఇక్కడికి ఆరుగురు ఏపీఎంలను బదిలీ చేశారు. మొత్తంగా డీపీఎంల నుంచి ఏపీఎంలు, సీసీల వరకు బదిలీలు అంతా గందరగోళమే. ప్రస్తుతం ఎఫ్ఏసీ పీడీగా ఉన్న ఓబులమ్మను కడప జడ్పీ సీఈఓగా బదిలీ చేశారు. గత మూడు నెలలుగా డీఆర్‌డీఏకు రెగ్యులర్ పీడీ లేకపోవడం కూడా ఉద్యోగుల బదిలీల గందర గోళానికి దారితీస్తోంది. మరి రెగ్యులర్ పీడీ ఎవరు, ఎప్పుడు వస్తారని ఆ శాఖలోని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.


బీటెక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 24: ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచ్(కోర్సుల్లో) స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు. వివరాలకు skucet.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

అర్ధరాత్రి తర్వాత ఆర్డర్స్..!

- 23న రాత్రి 12.45 గంటల తర్వాత బదిలీ ఉత్తర్వులు
- చీకటి ఉత్తర్వుల వెనుక వసూళ్ల శక్తులు
- కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో హడావుడి
- వాట్సాప్ గ్రూపుల్లో ఉత్తర్వు కాపీలు
- జిల్లా కేంద్రంలోనే అడ్డగోలు పాలన
- 'కాసు'క్కుర్చునోళ్లకు దగ్గరలో..
- కానివారికి దూరంగా పోస్టింగ్..
- జడ్పీలో ఇష్టారాజ్యంగా బదిలీలు
- నేటికీ ఉత్తర్వులు ఇవ్వని వైనం
- పోస్టులో పంపుతారట..!
- కోర్టును ఆశ్రయించే యోచనలో బాధితులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 24: బదిలీ ఆర్డర్స్ అర్ధరాత్రి తర్వాత బయటకొచ్చాయి. తమ అక్రమాలు, మామూళ్ల ఎక్కడ బయట పడతాయోననీ, బాధితులు ఎక్కడ నిలదీస్తారోనని అర్ధరాత్రి 12.45 గంటల తర్వాత ఉత్తర్వులు పంపారు. పైగా కొన్నింటిలో సంతకాలు కూడా లేవు. ఈ పరిణామాలు చాలు.. జిల్లా పరిషత్‌లో ఉన్నతాధికారులు ఏ తరహాలో బదిలీల్లో అక్రమాల బాగోతం నడిపారో అర్థం చేసుకోడానికి. వందలాది మంది ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతూ...కొందరు ఉన్నతాధికారులు, సిబ్బంది చేసిన అవినీతి బాగోతాన్ని చీకటి మాటున బాగానే రక్తి కట్టించారు. లక్షలాది రూపాయలు వసూలు చేసి... సొమ్ము చేసుకుని జడ్పీలో కొందరు ఉన్నతాధికారులు, వసూల్ రాజాలు ఇష్టారాజ్యంగా సామాన్య ఉద్యోగులను బదిలీల ఉత్తర్వులకు బలి చేశారు. ఈ బాగోతం 23వతేదీ రాత్రి తర్వాత జిల్లా కలెక్టర్ వరకూ వెళ్లినట్లు తెలిసింది. దీంతో అర్ధరాత్రి 12.45 గంటల తర్వాత హడావుడి చేశారు. ఆగమేఘాల మీద పాత తేదీలతో (21వతేదీ) సీఈఓ ఓబుళమ్మ సంతకాలతో కొన్ని, సంతకాలు లేకుండా మరికొన్ని, ఇంకా కొన్ని సీఈఓ తరపున (ఫార్ సీఈఓ) అంటూ ఉత్తర్వులు బయటకు పంపారు. మొత్తానికి జడ్పీ బదిలీలను గందరగోళం, ఇష్టారాజ్యంగా చేశారు. దీనిపై బాధిత ఉద్యోగులు భగ్గుమంటున్నారు. బదిలీ గడువు ముగిసినా... ఇప్పటి వరకూ ఉత్తర్వులు ఉద్యోగుల చేతికి ఇవ్వలేదు. తర్వాత పనిచేస్తున్న ప్రాంతానికి పోస్టులో పంపుతామని చెప్పారట. ఈ అక్రమాలపై కొందరు బాధితులు.. హైకోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారు. మరికొందరు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు. మరి కలెక్టర్ ఈ అక్రమార్కుల పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటారో.. బాధితులకు ఎలా న్యాయం చేస్తారో చూడాలి.



ఉన్నతాధికారి సంతకమే లేకుండా బయటకు వచ్చిన ఆర్డర్ కాపీ

బదిలీలు.. బాధలు..

ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదన్నదే సాధారణ బదిలీల వెనుక ఉద్దేశం. ప్రభుత్వం బదిలీలపై నిషేధాన్ని ఎత్తేసి, ఉద్యోగులకు సాధారణ బదిలీలు నిర్వహిస్తోంది. పిల్లల చదువులు, తల్లిదండ్రుల ఆరోగ్య భద్రత, ఉద్యోగుల ప్రాంతీయ సమస్యలు, స్పౌజ్, హెల్త్ గ్రౌండ్స్ ఇలా అనేక కోణాల్లో ఉద్యోగుల సౌలభ్యం కోసం నిబంధనల్లో వెసులుబాట్లు కల్పించి సాధారణ బదిలీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ ఉద్దేశాన్ని కొందరు ఉన్నతాధికారులు, స్వార్థపరులు డబ్బుకు కక్కుర్తి పడి నీరుగారుస్తున్నారు. ఏఓ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ తదితర పోస్టులు అనంతపురంలోని జడ్పీ కార్యాలయంతోపాటు జిల్లాకు దగ్గరగా ఉండే మండలకేంద్రాల్లోని ఎంపీడీఓ ఆఫీసుల్లో పోస్టింగ్ ఇచ్చేందుకు బేరాలు నడిపారు. రూ.లక్షలు మింగేసి... ఉద్యోగులను ఇష్టారాజ్యంగా బదిలీ చేశారు.

ఆలస్యం ఎందుకో..?

బదిలీ ఉత్తర్వులు 22వ తేదీ మధ్యాహ్నానికి ఇవ్వాల్సి ఉంది. భారీగా గోల్‌మాల్‌కు తెరలేపిన కొందరు ఉన్నతాధికారులు, పాలకులు, కిందిస్థాయి వసూల్‌రాయుళ్లు.. బదిలీల తంతును నోట్ల కట్టలు కొట్టే కామధేనువుగా మార్చుకున్నారు. అందుకే ఆలస్యంమీద ఆలస్యం చేశారు. 23వ తేదీ ఉదయం నుంచి రాత్రివరకూ ఉత్తర్వుల కోసం ఉద్యోగులు పడిగాపులు కాసేలా చేశారు. తీరా రాత్రికి జడ్పీలో సాగుతున్న అక్రమాలు జిల్లా కలెక్టర్ దృష్టికెళ్లాయి. దీంతో ఆర్డర్స్ ఇవ్వకుంటే... ఇరుక్కుపోతామని వెంటవెంటనే హడావుడి చేశారు. 23వ తేదీ అర్ధరాత్రి 12.45 గంటల తర్వాత నుంచి ఆర్డర్స్ సంతకాలతో కొన్ని, లేకుండా మరికొన్ని పీఆర్, జడ్పీ ఉద్యోగుల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. బదిలీల గందరగోళంపై జడ్పీ సీఈఓ ఓబుళమ్మ, ఇతర ఉన్నతాధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తంచేసినట్లు చర్చ నడుస్తోంది. తర్వాత 24వ తేదీ ఉదయం కూడా ఉద్యోగులకు బదిలీల ఉత్తర్వులు ఇవ్వలేదు. వాళ్ల పనిచేసే ప్రాంతాలు, ఆఫీసులకు పోస్టు ద్వారా ఉత్తర్వులు పంపుతామని సమాచారం చేరవేశారు. మొత్తంగా జడ్పీ బదిలీల్లో అక్రమ బాగోతంపై ఉద్యోగులు మండిపడుతున్నారు.

అక్టోబరు 2లోగా సవరించేరా..?

బదిలీ అయిన ఉద్యోగులను అక్టోబరు 2వ తేదీ రిలీవ్ చేయరని సమాచారం. పింఛన్ పంపిణీ ఇతర కారణాల వల్ల బదిలీ అయిన వారికి ఉత్తర్వులిచ్చినా... ఎవరినీ రిలీవ్ చేయవద్దంటూ పై నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఒకే స్టేషన్‌లో రెండు, మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని సైతం బలవంతంగా బదిలీ చేశారు. చాలా అక్రమాలే జరిగాయి. దీనిపై బాధిత ఉద్యోగులు.. జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. మరి కొందరు హైకోర్టును ఆశ్రయించనున్నారు. 2వ తేదీ వరకు ఉద్యోగులను రిలీవ్ చేయకూడదన్న ఆదేశాల నేపథ్యంలో మరోవారం వరకూ గడువు ఉంది. మరి ఈలోగానైనా చేసిన అక్రమాలు సరిదిద్దుకుంటారా...? వసూళ్లు చేసిన సొమ్ము... జేబుల్లో నింపుకున్న కొందరు అధికారులు కళ్లు మూసుకుని ఇవన్నీ మామూలే అంటూ మసులుతారో చూడాలి. బాధితులు మాత్రం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌కు, ఆ శాఖ ఉన్నతాధికారులకు ఇక్కడి అక్రమాలు చేరవేస్తున్నారు. ఏం జరుగుతుందోనని జిల్లాపరిషత్‌లో ఉత్కంఠ నెలకొంది.



అర్ధరాత్రి తర్వాత వాట్సాప్ గ్రూపుల్లో ఉత్తర్వులు

ఆరోగ్య ప్రదాత ఫార్మసిస్ట్

- కీలకపాత్రధారులైనా చిన్నచూపే
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని ఒత్తిడి
- నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 24: నేటి ప్రపంచంలో మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఔషధాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఆరోగ్యం కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ఏదో ఒకమందును వాడడం పరిపాటిగా మారింది. ఆరోగ్య పరిరక్షణలో ఔషధాలే కీలకం. అవి లేకుండా రోగాలకు చికిత్సలేదు. డాక్టర్ వ్యాధిని నిర్ధారించి మందులు సూచిస్తే.. వాటిని ఎలా వాడాలో చెప్పడంలో ఫార్మసిస్టే కీలకం. ఒక్కోసారి డాక్టర్ అందుబాటులో లేకపోతే రోగులకు ప్రాథమిక చికిత్స అందించే బాధ్యత కూడా ఫార్మసిస్ట్ తన భుజాలపై వేసుకుంటారు. ఇంతటి కీలకమైన ఫార్మసిస్టుల పాత్రను ప్రజలకు తెలియజేయడం కోసమే ప్రతి సంవత్సరం సెప్టెంబరు 25న 'ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం' నిర్వస్తున్నారు.

చిన్నచూపే..

ఆరోగ్య రంగంలో అత్యంత కీలక పాత్రధారులైన ఫార్మసిస్టులపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారనే ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. చిన్నపాటి ఆసుపత్రులయినా ముగ్గురు ఫార్మసిస్టులు ఉండాలనే చట్టానికి పార్లమెంటు ఆమోదం తెలిపింది. కానీ ఇప్పటికీ ఫార్మసీ చట్టం అమలు కావడంలేదు. ప్రపంచంలో రోజురోజుకు కొత్త రోగాలు, వైరస్‌లు జనంపై పడి ప్రాణాలు తీస్తున్నాయి. ఆ రోగాలను అంతమొందించడానికి మందులను తయారు చేయడంలోను, వాటి నివారణ మార్గాలు కనుక్కోవడంలోను ఫార్మసిస్టుల పాత్ర కీలకం. ఔషధాల నాణ్యతను పర్యవేక్షించడం, నిల్వ చేయడం, వినియోగంపై రోగులకు సూచనలు ఇవ్వడంలో ఫార్మసిస్టులదే ప్రధాన పాత్ర. ఆసుపత్రుల్లో రోగులకు అనుగుణంగా ఫార్మసిస్టులను నియమించడంలేదు. ఏళ్లబడి పనిచేస్తున్నా పదోన్నతులు దక్కడంలేదు. దీంతో చివరకు చిరుద్యోగులుగానే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

పని ఒత్తిడి..

అనంతపురం జిల్లాలో ఫార్మసిస్టుల పరిస్థితి దుర్భరంగా ఉంది. అధికారిక లెక్కల ప్రకారం వైద్యశాఖ పరిధిలో 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 25అర్బన్ పీహెచ్‌సీలు ఉన్నాయి. డీసీహెచ్ఎస్ కింద సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు కలిపి 11 ఉండగా, డీఎంఈ కింద జిల్లా సర్వజన ఆసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ, క్యాన్సర్ యూనిట్ ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 27 మంది మాత్రమే రెగ్యులర్ ఫార్మసిస్టులు ఉన్నారు. 18 మంది కాంట్రాక్ట్ ఫార్మసిస్టులు పనిచేస్తున్నారు. అర్బన్ పీహెచ్‌సీలలో ఎన్‌హెచ్ఎం కింద 25 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్కరే పనిచేయాల్సి ఉంటుంది. రాత్రి పనిచేసే ఆసుపత్రులలో ఫార్మసిస్టుల బాధలు వర్ణణాతీతం. కనీసం క్యాజువల్ లీవ్ తీసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఇక జిల్లా సర్వజన ఆసుపత్రికి రోజుకు రెండువేల మంది రోగులు వస్తున్నారు. ఇక్కడ కనీసం 20 మంది ఫార్మసిస్టులు ఉండాలి, కానీ 10మంది మాత్రమే ఉన్నారు. ఇందులో కూడా కొందరిని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి పంపించారు. పగలు ఫార్మసీ విద్యార్థుల ద్వారానే మందులు ఇస్తున్నారు. రాత్రిపూట ఒక్కరినే ఉంచడంతో ఇబ్బందులు పడుతున్నారు. సూపర్‌స్పెషాలిటీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రోజూ 400 నుంచి 600మంది వరకు రోగులు వస్తున్నారు. వందల రకాలు మందులు అందుబాటులో ఉంటాయి. వాటిని రోగులకు అందించడానికి తగినంత మంది ఫార్మసిస్టులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని ఔషధాల కేంద్రం

మా కష్టానికి గుర్తింపు లేదు



నేను 31సంవత్సరాలుగా ఫార్మసిస్టుగా పనిచేస్తున్నా. అపుడు 50 నుంచి 60రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇపుడు 600 నుంచి 700 వరకు వివిధ రకాల మందులు అందుబాటులోకి వచ్చాయి. అందుకు తగ్గట్టుగా డాక్టర్లు రాసిన మందులను రోగులకు అందిస్తున్నాం. ఏ మందులు ఎలా వాడాలో కూడా చెబుతున్నాం. రోగులు, మందులు సంఖ్య పెరిగినా ఫార్మసిస్టుల సంఖ్య మాత్రం పెరగలేదు. నిబంధనల మేరకు ఫార్మసిస్టులను నియమించాలి.

- నరసింహారావు, ఫార్మసిస్ట్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి

పని ఒత్తిడితో సతమతం



విపరీతమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నాం. ఈ టెన్షన్లకు అనతికాలంలోనే బీపీలు, షుగర్ వచ్చే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పీహెచ్‌సీలలో 172రకాల మందులను ఫార్మసిస్టు నిర్వహించాల్సి ఉంది. రోగులకు ఏ మందులు, ఎంతడోస్ ఇస్తున్నామనే అన్ని వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి. టీకాల వ్యాక్సిన్ టెంపరేచర్ కూడా చూడాల్సి ఉంటుంది. మహిళా ఫార్మసిస్టులం చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ కష్టాలు తీరాలంటే ప్రతి పీహెచ్‌సీకి అదనంగా మరో ఫార్మసిస్టును నియమించాలి.

-సరస్వతి, ఫార్మసిస్టు, పీహెచ్‌సీ, నార్పల

ఉద్యోగోన్నతులు కల్పించాలి



ఆరోగ్యశాఖలో ఫార్మసిస్టులు కీలకమైనా సరైన గుర్తింపు ఇవ్వడంలేదు. 30ఏళ్లుగా ఒకే కేడర్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్నాం. డీఎంహెచ్ఓ పరిధిలోని మలేరియా, క్షయ విభాగం, డ్రగ్స్ స్టోర్‌తో పాటు డీసీహెచ్ఎస్, డీఎంఈ వైద్య శాఖల జోన్ల పరిధిలోనూ అనేక సీనియర్ ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరోగ్యశాఖలో అన్ని కేడర్లకు పదోన్నతులు ఉన్నాయి. మాకు మాత్రం లేకపోవడం బాధాకరం. ప్రభుత్వం మా కష్టాన్ని గుర్తించి పదోన్నతులు కల్పించి, అన్నింటా రెగ్యులర్ ఫార్మసిస్టులను నియమించాలి.

- మాధవ్, జిల్లా అధ్యక్షుడు, ఫార్మసిస్టుల సంఘం

రెండిళ్లలో చోరీ

రూ.2.20లక్షల నగదు, 17 తులాల బంగారం అపహరణ

తాడిపత్రి, సెప్టెంబరు 24: మండలంలోని ఇగుడూరు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున నారాయణస్వామియాదవ్, సూర్యనారాయణయాదవ్ ఇళ్లల్లో దొంగలు చొరబడి రూ.2.20లక్షల నగదు, 17తులాల బంగారం దోచుకెళ్లారు. బాధితుల వివరాల మేరకు.. నారాయణస్వామియాదవ్, సూర్యనారాయణయాదవ్, ఆదినారాయణయాదవ్ అన్నదమ్ములు. వీరు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదినారాయణయాదవ్ కుటుంబ సభ్యులతోపాటు అన్నదమ్ములను తీసుకొని సోమవారం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. రెండిళ్లల్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు తెల్లవారుజామున నారాయణస్వామియాదవ్, సూర్యనారాయణయాదవ్ ఇళ్ల లోపలికి ప్రవేశించారు. నారాయణస్వామి బీరువాలో ఉన్న రూ.2లక్షల నగదు, 15తులాల బంగారం నగలను దోచుకెళ్లారు. అదే విధంగా సూర్యనారాయణ ఇంటిలో ఉన్న రూ.20వేలు నగదుతోపాటు 2తులాల కమ్మలు, వెండి గొలుసులు, జుంకీలు, ఉంగరాలు దోచుకెళ్లారని తెలిపారు. ఆదినారాయణస్వామి ఇంట్లో ఉన్న తల్లి సుబ్బలక్షుమ్మ ఉదయం 11గంటల సమయంలో నారాయణస్వామి, సూర్యనారాయణ ఇళ్లల్లో ఫ్యాన్ వేసి ఉండడం గమనించింది. దొంగతనం జరిగినట్లు గుర్తించింది. వెంటనే కుమారులకు ఫోన్‌ద్వారా సమాచారం చేరవేసింది. దీంతో వారు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శివగంగాధర్ రెడ్డి, ఎస్ఐ కాటయ్యలు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని సీఐ తెలిపారు.

రేపు స్వచ్ఛతా హీ సేవపై విద్యార్థులకు పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24: స్వచ్ఛతా హీ సేవాపై ఈనెల 26న ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ రోడ్డులో ఉన్న సైన్సుసెంటర్‌లో ఉదయం 10గంటలకు విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఈఈ మునిప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఇతర యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పోటీలకు అర్హులన్నారు. 'గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవ అమలు-సవాళ్లు' అనే అంశంపై 45 నిమిషాల వ్యవధిలో వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 'వ్యర్థ రహిత ఇండియా స్థాపనలో యువత పాత్ర' అనే అంశంపై 5 నిమిషాల కాలవ్యవధిలో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. 'స్వచ్ఛతాహీ సేవలో కమ్యూనిటీ భాగస్వామ్యం'పై 60 నిమిషాల్లో పోస్టర్లు తయారు చేయాలని, ప్రజల్లో అవగాహన కల్పించే అంశంపై 5 నిమిషాల లఘుచిత్రాన్ని నిర్మించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9441823923ను సంప్రదించాలని కోరారు.



దెబ్బతిన్న కల్వర్టు

కల్వర్టు బాగు చేయండి

కదిరి అర్బన్, సెప్టెంబరు 24 : పట్టణంలోని వలీసాబ్‌రోడ్డులోని 29 వార్డులో హన్సర్‌బాషా వీధి కల్వర్టు పూర్తిగా పూర్తిగా దెబ్బతింది. నెల రోజుల క్రితం మున్సిపల్ సిబ్బంది పూడిక తీత సమయంలో ఈ కల్వర్టు కూలింది. దీంతో ఆ వీధిలోకి తోపుడుబండ్లు, తాగునీటి ట్యాంకర్లు, ఆటోలు వెళ్లడానికి వీలులేకుండాపోయింది. నిత్యం చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఈ రహదారి గుండా వెళ్తున్నా పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేయించుకోండి

కదిరి, సెప్టెంబరు 24: నియోజకవర్గంలో అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు లేఅవుట్ వేసిన వారితో రెగ్యులరైజ్ చేయించుకోవాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ... పట్టణంలో క్రమబద్ధంగా భవిష్యత్ తరలకు ఉపయోగపడేలా పట్టణాన్ని నిర్మించబోతున్నామన్నారు. అక్రమ లేఅవుట్లో రోడ్లు, కాలువలు లేకుండా కొంతమంది భూ దందాలు చేశారన్నారు. ఈ దందాల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు వాటిని రెగ్యులరైజ్ చేయించుకోవడానికి భూదందా చేసిన వారిని అడగాలన్నారు. లేకపోతే తమ దృష్టికి తెచ్చినా వాటిని పరిష్కరిస్తామన్నారు. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొటే వాటిని రిజిష్టర్ చేయవచ్చని ఇప్పటికే రిజిష్టర్ కార్యాలయంతో పాటు మున్సిపాలిటీకి ఆదేశించామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, అక్రమ లేఅవుట్లో ప్లాట్లు కొనువద్దన్నారు. ఇప్పటికే కొని ఉంటే వాటిని రెగ్యులరైజ్ చేయాలని భూమి అమ్మినవారిపై ఒత్తిడి తేవాలన్నారు. అక్రమ లేఅవుట్లు తొలగించే సమయంలో తాము నష్టపోయామని ఫిర్యాదు చేయవద్దని కోరారు. అక్రమ లేఅవుట్‌ను ఎటువంటి పరిస్థితిలో కొనసాగించబోమన్నారు.

భర్తపై దాడి చేసిన భార్య అరెస్టు

కదిరి, సెప్టెంబరు 24: భర్తపై భార్యతో పాటు మరో వ్యక్తి దాడి చేసిన కేసులో ఆ ఇద్దరిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పట్టణంలోని వేమారెడ్డి సర్కిల్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్న పద్మజ, ఆమె భర్త మధుసూధన్‌ల మధ్య చాలాకాలంగా మనస్పర్థలున్నాయి. ఈనెల 18న రాత్రి వాణీ వీధిలో పద్మజ, కాలేషా మస్తాన్‌వలీతో కలిసి వెళ్తుండగా, మధుసూధన్ అనుమానించి ప్రశ్నించారు. దీంతో పద్మజ, కాలేషా మస్తాన్‌వలీ కలిసి మధుసూదన్‌పై దాడి చేశారు. మధుసూదన్ ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని కాలేషా మస్తాన్‌వలీ, పద్మజను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు అక్షాయని



ధర్మవరం, సెప్టెంబరు 24 : ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి జూడో పోటీలకు స్థానిక ఆదిత్య పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న అక్షాయని ఎంపికైంది. ఈ నెల 21న తిరుపతిలోని వెంకటేశ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనబరచి జాతీయ జూడో పోటీలకు ఎంపికైంది. గుజరాత్‌లో అక్టోబరు 2,3 తేదీల్లో నిర్వహించే జూడో పోటీల్లో పాల్గొంటారు. అక్షాయనిని పాఠశాల కరస్పాండెంట్ జనార్దన్, జూడో కోచ్ ఇనాయత్‌బాషా అభినందించారు.

టీడీపీతోనే మైనార్టీల అభివృద్ధి

బుక్కపట్నం: టీడీపీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని జామియా మసీదు మతపెద్దలు పేర్కొన్నారు. మంగళావారం స్థానిక జామియా మసీదులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం మైనార్టీలను పూర్తిగా విస్మరించి.. అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మైనార్టీ సంక్షేమం కోసం హజ్ యాత్రకు నిధులు, వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ, మౌలానాలు, ఇమామ్‌లకు గౌరవ వేతనం ప్రకటిం చిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లీ సయ్యద్‌బాషా, మత పెద్దలు స్టూడియో ఫక్రుద్దీన్, సాదిక్‌వలీ, వాజీద్ పాల్గొన్నారు.



తనకల్లు ఎస్ఐగా గోపి

తనకల్లు, సెప్టెంబరు 24: మండల ఎస్ఐగా గోపి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ధరణీబాబు వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో లేపాక్షిలో పనిచేస్తున్న గోపిని ఇక్కడికి నియమించారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

బత్తలపల్లి సెప్టెంబరు 24: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్ ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్‌గా నియమితులు కావడంపై మండల నాయకులు మంగళవారం సంబారాలు చేసుకున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో బాణాసంచా పేల్చారు. విజయ్‌కుమార్ మండలంలోని మాల్యవంతం గ్రామ వాసి.

వరద బాధితులకు రూ.50 వేల విరాళం

పుట్టపర్తి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం గోవిందపేటసేవాసమితి సభ్యులు రూ. 50 వేల చెక్కును కలెక్టర్ టీఎస్‌చేతన్‌కు మంగళవారం అందచేశారు. ఇందులో జిల్లా కేంద్రంలోని గోవిందపేట సమితి సభ్యులు తలిపినేని రామప్ప ఎంవీ నాయుడు, షామీర్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.





గంగమ్మ తల్లికి మారుపూజ

ధర్మవరంరూరల్: మండలంలోని కుణుతూరు గ్రామంలో నూతన ఆలయంలో గంగమ్మ తల్లిని ప్రతిష్ఠించి 40 రోజులు అయిన సందర్భంగా మంగళవారం మారు పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలం కరించారు. అమ్మవారిని ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు.

బీసీ వసతి గృహం స్వాధీనం

నల్లచెరువు, సెప్టెంబరు 24: అర్థంతరంగా ఆగిపోయిన స్థానిక బీసీ వసతి గృహాన్ని జిల్లా బీసీ సంక్షేమాధికారి నిర్మలజ్యోతి మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. 2003లో బాలికల వసతిగృహ నిర్మాణానికి స్థలాన్ని షెక్షావలీ దానమించారు. 2004లో నిర్మాణ దశలో అది ఆగిపోయింది. దీంతో ఆ భవనంలో షెక్షావలీ వాడుకునేవాడు. మూడు, నాలుగు నెలల్లో వసతిగృహం నిర్మాణం పూర్తి చేసి వినియోగంలో తేవాల్సి ఉండటంతో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఆ భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ అశోక్ కుమార్, బీసీ వసతి గృహం వార్డెన్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ, పోలీస్‌లు పాల్గొన్నారు.

కాలేజీలో స్వచ్ఛతా హీ సేవ

ధర్మవరంరూరల్: స్థానిక శ్రీవివేకానంద డిగ్రీకళాశాల విద్యార్థులు స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం రేగాటిపల్లి రోడ్డు, కళాశాల ప్రాంగణంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ పీఓ హర్షవర్ధన్, ఏఓ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వానప్పా.. రావప్పా..!

- వర్షాలు రాక ఎండుతున్న పంటలు
- అయోమయంలో అన్నదాతలు
- కొద్దిపాటి నీటితో రక్షక తడులు
- కప్పలకు.. గాడిదలకు పెళ్లిళ్లు చేస్తున్న వైనం
- అమ్మవార్లకు బోనాలు.. ఆలయాల్లో ప్రార్థనలు




దేవళం తండా వద్ద ఎండిన వేరుశనగ పంట

తనకల్లు, సెప్టెంబరు 24: మండలంలో పరిశ్రమలు లేకపోవడంతో వందకు 80 శాతం మంది వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. అందులోనూ 60 శాతం మంది వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. పదేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా వర్షాధార పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయినా ధైర్యం చేసి ఈసారి మండల రైతులు పంటలు వేశారు. ఈ యేడాది ప్రారంభంలో వర్షాలు బాగా పడడం, శాస్త్రవేత్తలు సైతం వర్షాలు బాగుంటాయని చెప్పడంతో వర్షాధార రైతులు గతంలో కంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేశారు. పంట ఏపుగా వచ్చింది. ఒకతడి (ఒకసారి వర్షం) బాగా కురిస్తే పంటలు పంటలు చేతికొచ్చే పరిస్తితి. తీరా పంట చేతికొచ్చే సమయంలో వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో ఆ పంటలు ఎండిపోతున్నాయి. అష్టకషాలు పడి ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంటలు తమ కళ్ల ఎదుటే ఎండిపోతుంటే ఏమిచేయాలో దిక్కుతోచక రైతులు అయోమంలో పడ్డారు.

కొన్ని గ్రామాల్లో వర్షం కోసం కప్పలపెళ్లి.. గాడిదలకు పెళ్లి.. రామ భజనలు.. కుండ సగినాలు.. శాస్త్రలు నిర్వహిస్తున్నారు. ఏది చేసినా వర్షం కురవకపో వడంతో మనోవేదనకు గురవుతున్నారు. ఈ యేడాది కూడా పంటలు పూర్తిగా నష్టపోయినట్లే అని వాపోతున్నా రు. ప్రభుత్వం ఆదుకోకపోతే తాము మరింత అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిందే అని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు పంటల బీమాలు వర్తించేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రక్షక తడులు

ఓబుళదేవరచెరువు: మండల కేంద్రానికి చెందిన మండోజీ ఆర్ఫీఖాన్‌కు మామిళ్లకుంటపల్లి వద్ద నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ పంటను సాగుచేశారు. అయితే పంట కోతసమయంలో చినుకు పండకపోవడంతో నేలగట్టిపడింది. అర కిమీటర్ దూరంలోని రైతుల బోరు నుంచి పైపుద్వారా నీటిని తీసుకుని పంటను తడుపుతున్నారు. రోజుకు రూ.500 కూలి పెట్టి ఇరువురితో నేల తడుపుతున్నట్లు చెప్పారు. కనీసం పశుగ్రామమైనా దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఓడీసీలో ఎండిన వేరుశనగను నీటితో తడుపుతున్న రైతులు

రక్షక తడులు ఇప్పించాలి



నాలుగు ఎకరాల్లో అప్పులు చేసి.. వేరుశనగ వేశాను. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు బాగా పడ్డాయి. ఎంతో ఆనంద పడ్డాం. ఇక ఒక సారి వర్షం పడితే పంట చేతికొస్తుంది. ఈ సమయలో వాన రాలేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. మేం పడుతున్న బాధ అంతా.. ఇంతా కాదు. ప్రభుత్వం స్పందించి రక్షక తడులైనా ఇప్పించాలి. అప్పుడు ఎంతో కొంత పంట అయినా చేతికొస్తుంది.

-చంద్రానాయక్, రైతు, దేవళంతండా

గాడిదలకు పెళ్లి



కదిరి: తలుపులలో వర్షం కోసం మంగళవారం గాడిదలకు పెళ్లి చేశా రు. అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షం వచ్చి.. వరదలు వస్తున్నా.. తలుపుల మండలంలో వర్షం జాడలేదు. గాడిదలకు పెళ్లి చేస్తే వర్షాలు పడతాయన్న నమ్మకంతో రైతులు మంగళవారం వాటిని పెళ్లి చేశారు. పెళ్లి అనంతరం ఆ గాడిదల ను ఊరేగించారు. ఇదేకాకుండా మండలంలో మహిళలు, రైతులు, గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడం, దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రైతులు ఎద్దుల రాముడు, ఈశ్వరయ్య, జివి, రమణ, చాకలి నారాయణ, ఎల్‌వి రమణ, చాకలి రవి, హరి, లక్ష్మన్ పాల్గొన్నారు.

సజ్జ సాగు చేశా



ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభలో వర్షాలు బాగా పడ్డాయి. మూడు ఎకరాల్లో సజ్జ పంట వేశా. పంట ఏపుగా పెరిగి కోత దశకు వచ్చింది. ఓతడి (ఒకసారి వర్షంపడితే) నాణ్యమైన పంట చేతికొస్తుంది. ఈ సమయంలో వాన రాక పంటలన్నీ ఎండిపోతున్నాయి. చేతికొచ్చిన పంట కళ్ల ఎదుటే ఎండుతోంది. చేసేదేమీ లేక కుమిలిపోతున్నాం. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

-తిప్పన్ననాయక్, దేవళంతండా

పవన్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం

కదిరి అర్బన్, సెప్టెంబరు 24: తిరుమల దేవస్థానంలో వైసీపీ పాలనలో లడ్డూను అపవిత్రంపై చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 11 రోజుల పాటు చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. మంగళవారం స్థానిక నరసింహస్వామి ఆలయం వద్ద జనసేన నాయకులు సంఘీభావ దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ... వందల యేళ్ల నుంచి తిరుమల పవిత్రను కాపాడుతూ వచ్చిన తరుణంలో వైసీపీ ప్రభుత్వం బాధ్యత లేనివారికి పదవులిచ్చి హిందూధర్మానికి భిన్నంగా వ్యవహరించిందన్నారు. కల్తీ నెయ్యి కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన భైరవప్రసాద్, మంచి శివశంకర్, కుటాల లక్ష్మణ్, అనురాధ, షమీమ్, రాజేంద్ర, గణేష్, కేవీ రమణ, జయవర్ధన్, బిజెపి షైనోద్దీన్, రమేష్, వీహెచ్‌పీ నాయకులు రామమోహన్, రవిచంద్ర, కొత్త రమేష్ పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద మద్దతు దీక్ష చేపట్టిన నాయకులు

కేతిరెడ్డిని జిల్లా నుంచి బహిష్కరించాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, సెప్టెంబరు 24: సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని వెంటనే జిల్లా నుంచి బహిష్కరించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ మాట్లాడుతూ.. కేతిరెడ్డి గతంలో టీడీపీ కార్యకర్తలపైన అనేక కేసులు పెట్టించి.. రౌడీషీట్లు ఓపెన్ చేయించాడని, అప్పుడే ఏ కార్యకర్త భయపడలేదని, ఇప్పుడు అసలు భయపడే ప్రశక్తే లేదని అన్నారు. ఇలాగే దౌర్జన్యాలకు దిగితే ఎన్డీఏ కూటమి నాయకులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. గతంలో ముదిగుబ్బ నడిఒడ్డున టీడీపీ కార్యకర్తను హత్య చేయించింది.. ధర్మవరం ప్రెస్ క్లబ్‌లో బీజేపీ నాయకులపై దాడులు చేయించింది కేతిరెడ్డేనని అన్నారు. అందరి లెక్కలు తేలుస్తానని నాడు కేతిరెడ్డి హెచ్చరించాడని, ఆయన లెక్కలు ఏమిటో ఇక నుంచి కూటమి నాయకులు తేలుస్తారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్ బాబు, కోట్ల బాబి, వినోద్‌బాబు, మహబూబ్‌పీరా, శేఖర్‌రాజు, సూరి, శివయ్య, తిరుమలేష్, నరేష్, బాసినేని హేమేంద్ర, నారాయణస్వామి, దామోదర, వెంకట కిష్ట, రంగనాయకులు, బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 24: జిల్లాలోని పాలసముద్రం వద్ద నాసిన్, బెల్ కంపెనీలకు భూములు ఇచ్చిన వారికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సీపీఎం నాయకులు.. జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ... భూనిర్వాసితలు సమస్యలపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిస్కారవేదికలో ఫిర్యాదు చేశామని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. మూడు సంవత్సరాల నుంచి వినతులు.. నిరసన.. పోరాటాలు.. చేస్తూనే ఉన్నారని, అయినా ఫలితం అందలేదన్నారు. దీనికి తోడు పోలీసుల అక్రమ కేసులు బనాయించారని వాపోయారు. స్పందించిన జేసీ ఏడు రోజులలోపు పూర్తిగా పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేసు, సీపీఎం సీనియర్ నాయకులు రామకృష్ణ, భూనిర్వాసిత పోరాట కమిటీ సభ్యులు వెంకటరామిరెడ్డి, వెంకట్రాముడు, అచ్చెమ్మ, రమీజాబీ, గంగమ్మ, వెంకటలక్ష్మి, నారాయణ పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందచేస్తున్న సీపీఎం నాయకులు

పందెంరాయుళ్ల అరెస్ట్

ముదిగుబ్బ,సెప్టెంబరు 24: మండలంలోని పి కొట్టాల సమీపంలో మద్దిలేరు వాగు వద్ద కోడిపందెలు ఆడుతున్న స్థావరంపై పట్నం పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. కోడిపందేలు ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేయడంతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి రూ.15,830 నగదు, రెండు కోళ్లు, 6 ఆరు కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు, పట్నం ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

కేతిరెడ్డి డైరెక్షన్‌లో డీఎస్పీ: చిలకం

ధర్మవరం, సెప్టెంబరు 24 : మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి డైరెక్షన్‌లో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు కూటమి నాయకుల మధ్య చిచ్చురేపే ప్రయత్నం చేస్తున్నారని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన తన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ.. సోమవారం సబ్‌జైలు ఎదురుగా బీజేపీ నాయకులపై వైసీపీ గుండాలు దాడులకు దిగడమే కాకుండా.. కేతిరెడ్డి తమపైనే వ్యక్తిగత విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి నాయకులు ఆ గొడవలకు వెళ్లకుండా నిలువరించామన్నారు. 2009లో తన భిక్షతోనే కేతిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాడని, తండ్రి లేని వాడనంటూ తనను ఎన్నిసార్లు ప్రాధేయపడ్డాడో ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఇకనైనా తనపై కేతిరెడ్డి ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.



> **ప్రకటన**
>
> కుందిటి రామాంజినేయులు S/o హనుమంతప్ప,D.No.10-31, పోతుకుంట కాలనీ, ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా. Doc.No.10373/2022, సర్వే నెం.397-3లో 3.75సెంట్లను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ధర్మవరం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజుల లోపు ధర్మవరం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించండి.
> హద్దులు:తూర్పు: అగ్రిగోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి జమీను, పడమర: ప్లాట్ నెం.90, ఉత్తరం: 22అడుగుల వెడల్పు గల రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం. 82
>
> M.హుస్సేన్ బాషా, అడ్వకేట్, ధర్మవరం.

> **ప్రకటన**
>
> గుజ్జల శారదమ్మ W/o వెంకట నరసింహులు D.No.4-159, STకాలనీ, ఏకపాదం పల్లి, తాడిమర్రి మండలం,శ్రీ సత్యసాయి జిల్లా. Doc.No.1100/2020, సర్వే నెం.82-1Nలో 6.16సెంట్లను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ధర్మవరం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజుల లోపు ధర్మవరం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించండి.
> హద్దులు:తూర్పు: సొంత బయలు ఇదే సర్వేనెం.పైకి గలదు, పడమర: సొంత బయలు ఇదే సర్వేనెం, ఉత్తరం: రస్తా ఈ మధ్య పై కొలతలు గల బయలు జాగా, దక్షిణం:రస్తా.
>
> M.హుస్సేన్ బాషా, అడ్వకేట్, ధర్మవరం.

> **ప్రకటన**
>
> D.నాగేంద్ర S/o యల్లప్ప, D.No.32/122, గుట్టకిందపల్లి, ధర్మవరం,శ్రీ సత్యసాయి జిల్లా. Doc.No.4877/2020, సర్వే నెం.531-4లో 4.35సెంట్లను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ధర్మవరం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజుల లోపు ధర్మవరం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించండి.
> హద్దులు:తూర్పు: బుక్రా పెద్దన్న భూమి, పడమర: ప్లాట్‌నెం.6, ఉత్తరం: ప్లాట్‌నెం.5, దక్షిణం:20 అడుగుల వెడల్పు రోడ్డు.
>
> M.హుస్సేన్ బాషా, అడ్వకేట్, ధర్మవరం.

> **ప్రకటన**
>
> B.లావణ్య W/o B.విష్ణువర్ధన్ రాజు, D.No.B-3, K.S.నగర్, గోకులం, ఎనుములపల్లి, పుట్టపర్తి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. Doc.No.1003/2019, సర్వే నెం.34-4లో 3.21 సెంట్లను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ధర్మవరం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజుల లోపు ధర్మవరం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించండి.
> హద్దులు:తూర్పు: 15 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్‌నెం.8, ఉత్తరం: 16 అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం. 10.
>
> M.హుస్సేన్ బాషా, అడ్వకేట్, ధర్మవరం.

రైతు సంక్షేమమే లక్ష్యం

'పొలం పిలుస్తోంది'లో మంత్రి సవిత

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 24 : రైతు సంక్షేమంలో భాగంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని రాష్ట్ర చేనేత, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నిడిమామిడి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంటల సాగుపై ఆసక్తి చూపాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ.. రైతులందరూ ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలాను గుణంగా రైతులు నూతన టెక్నాలజీ అందిపుచ్చుకో వాలన్నారు. అనంతరం ఎండ్ల బండిలో మంత్రి, ఎమ్మెల్యే, మాజీ మంత్రి పర్యటిస్తూ సందడి చేశారు.

నంబులపూలకుంట: మండలంలోని పి.కొత్తపల్లిలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం, పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. పంట సాగు విస్తీర్ణ పెంచాలని, సేంద్రీయ ఎరువులతోనే పంటలు పండించాలని రైతులకు సూచించారు. రైతుకు లాభదాయక పంటలపై అవగాహన కల్పించాలని ఏడీఏ సత్యనారాయణకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మనోహర్‌బాబు, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీనివాసులరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ నరేంద్రరెడ్డి, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ గోపాల్‌నాయక్, సర్పంచ్ చంద్రకళ, టీడీపీ మండల కన్వీనర్ చంద్ర శేఖర్ నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండలంలోని మీర్జాపురంలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. సామూహిక సీమంతాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని మల్లిరెడ్డిపల్లి, పెద్దపల్లి, నక్కరాళ్లతండా గ్రామాల్లో మంగళవారం వ్యవ సాయాశాఖా ఆధ్వర్యంలో పొలం పొలుస్తోంది కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీహరినాయక్, ఎంపీఈఓ మెహతాజ్, పశు సంవర్ధక శాఖ సుధాకర్ నాయక్, జనజాగృతి శ్రీనాథ్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్: మండలంలోని తిప్పేపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని గొట్లూరు, నాగలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

కదిరి, (అమడగూరు) : మండలపరిధిలోని పెరంవాండ్లపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవాకం ఏఓ వెంకటరమణాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ఏపీసీఎస్ఎఫ్ ఆర్‌వైఎస్ఎస్ రవీంద్రా రెడ్డి, దామోదర్‌రెడ్డి, వీహెచ్ఏ పవనకళ్యాణ్, బూత్ కన్వీనర్ నరసింహమూర్తి, వాటర్ మ్యాన్ గంగులప్ప, రైతులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : మండలంలోని బాబాసాహెబ్‌పల్లి, మామిళ్లకుంట్లపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ ఇలియాజ్ అహమ్మద్ నిర్వహించారు. ఇందులో ఏఈవో వెంకటేష్, పట్టుపరిశ్రమ శాఖ టీఏ నాగేశ్వరయ్య, వీఏఏ శ్రావణి, అంజినాయక్, ఎంపీఈఓ సరస్వతి, టీడీపీ నిజాం, షబ్బీర్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని కొండకమర్ల, కుంట్లపల్లి, వెంకటాపురంలో కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో వ్యవసాయశాఖ అధికారి రమాదేవి, పట్టుపరిశ్రమ అధికారి చంద్ర మోహన్, హార్టీకల్చర్ అధికారి రామాంజినేయులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని ఎద్దులవాండ్లపల్లి తండా సమీపంలోని నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్ర మంలో ఏఓ సుమతి, పశువైద్యాధికారి శ్రీహరినాయక్, సర్పంచ్ రమావత్ భారతి, టీడీపీ కన్వీనర్ మైలే శివ శంకర్, బుట్టి నాగభూషణనాయుడు పాల్గొన్నారు. అలాగే మండలంల తోని కొండ్రవారిపల్లిలో టీడీపీ నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.





నిడిమామిడిలో మాట్లాడుతున్న మంత్రి సవిత, పి.కొత్తపల్లి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

బాల్య వివాహాలు నేరం : ఎంఈఓ

మడకశిర రూరల్, సెప్టెంబరు 24 : బాల్యవివాహాలు చట్టరీత్యానేరమని ఎంఈఓ భాస్కర్ తెలిపారు. మహిళాశిశు సంక్షేమశాఖ, ఆర్‌డీటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గుండుమల కేజీబీవీ పాఠశాలలో 'బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలు చేయాలని చూస్తే బాల్యవివాహ నిరోధక చట్టం ప్రకారం శిక్షార్హులు అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ లీలావతి, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, ఎస్ఓ విజేత, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా బాలక్రిష్ణనాయక్

గోరంట్ల, సెప్టెంబరు 24: మండల ట్రాన్స్‌కో ఏఈగా బాలక్రిష్ణనాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న క్రిష్ణ శ్రీనివాస్ గాండ్లపెంట ఏఈగా బదిలీపై వెళ్లారు. నల్లమాడ మండలంలో పనిచేస్తున్న బాలక్రిష్ణనాయక్ గోరంట్ల ఏఈగా నియమితులయ్యారు.

వర్షం రాకతో రైతుల్లో ఆనందం

గోరంట్ల, సెప్టెంబరు 24: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి 64.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఖరీఫ్‌లో 15,250 ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. ఎండుదశకు చేరుకున్న స్థితిలో వర్షం కురవడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వేరుశనగే 5,850 ఎకరాల్లో సాగుచేశారు. నెలరోజులుగా వర్షం కురవకపోవడంతో పంట పూర్తిగా దెబ్బతినింది. ఎండిపోయే దశలో వర్షం రావడంతో కనీసం పశుగ్రాసమైనా దక్కుతుందని రైతులు చెబుతున్నారు. మంగళవారం కూడా కొద్దిపాటి వర్షం కురిసింది.

సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాల పంపిణీ

రొళ్ల, సెప్టెంబరు 24 : మండలంలోని అన్ని పాఠశాలలకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. ప్రతి విద్యార్థి వద్ద పాఠ్యపుస్తకాలు ఉండాలని లేని పక్షంలో ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించి పాఠ్యపుస్తకాలు అందజేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అన్ని పాఠశాలలకు సరిపడా పాఠ్యపుస్తకాలను సరఫరా చేసినట్లు ఆయన వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

హిందూపురం, సెప్టెంబరు 24 : పట్టణంలోని లక్ష్మీపురం దాల్‌మిల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మంగళవారం స్థానికులు గుర్తుతెలియని వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. అతడి వయసు సుమారు 55ఏళ్లు ఉంటుందన్నారు. కొద్దిరోజులుగా పట్టణంలోని వాల్మీకి సర్కిల్, చిన్నమార్కెట్ ప్రాంతంలో యాచిస్తూ ఉండేవాడని పోలీసులు తెలిపారు. అతడిది ఏ ఊరనే వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాగునీటి సమస్య తీర్చిన రైతులు

రూ.50వేల సొంత ఖర్చులతో పైప్‌లైన్ నిర్మాణం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 24 : పెనుకొండ నగర పంచాయతీ కోనాపురంలో గత మూడేళ్లుగా తాగునీటి సమస్యతో కొట్టుమిట్టాడుతున్నారు. బిందె నీటి కోసం కిలోమీటర్ల మేర వ్యవసాయ పొలాలకు వెళ్లి తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రైతులు విజయ్‌క్రిష్ణ, నంజుండస్వామి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ముందుకు వచ్చారు. రూ.50వేలు సొంత ఖర్చులతో వ్యవసాయ పొలం నుంచి ఆంజనేయస్వామి కాలనీకి పైపులైన్ వేయించి ప్రజల దాహార్తిని తీర్చారు. మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్న మహిళలు, ప్రజలు ఆంజనేయస్వామి గుడివద్ద కొళాయి ఏర్పాటు చేయడంతో హర్షం వ్యక్తం చేశారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 24: ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25, 26 తేదీల్లో జరిగే ఆటల పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో చురుగ్గా ఉంటే శారీరకంగా, మానసికంగా ధ్రుడంగా ఉంటారని తెలిపారు. క్రీడల వల్ల ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, పరిగి, సోమందేపల్లి, రొద్దం, గోరంట్ల, పెనుకొండ మండలాల పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది దురుసు ప్రవర్తన

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 24 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులపై ఆరోగ్య సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం మండల పరిధిలోని పందిపర్తి గ్రామానికి చెందిన విద్యార్థినికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు సమ్మెలో ఉండటంతో స్టాఫ్‌నర్సుకు చూపించారు. పాపకు నీరసంగా ఉండటంతో సెలెన్ ఎక్కించాలని కోరారు. అలా చేయడానికి వీలులేదని తెలిపారు. విధుల్లో ఉన్న అకౌంటెంట్ మధుసూదన్ కలగజేసుకుని అందించిన చికిత్సను పొందాలన్నారు. ఏమి చికిత్స చేయాలో తమకు తెలుసని విద్యార్థిని తల్లిదండ్రులతో వాదనకుదిగారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ తారాస్థాయికి చేరింది. దీనిపై మెడికల్ ఆఫీసర్ హరిని వివరణ కోరగా తాము సమ్మెలో ఉన్నామని, విషయం తెలియదన్నారు. సిబ్బంది దురుసు ప్రవర్తనపై ఆరాతీస్తామన్నారు. అనుచితంగా ప్రవర్తించి ఉంటే చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు

మడకశిరటౌన్, సెప్టెంబరు 24 : మడకశిర సబ్ రిజిస్ట్రార్‌గా పి.నరసింహమూర్తి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురంలో చిట్స్ సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా మడకశిరకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రయవిక్రయదారులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో రిజిస్ట్రేషన్లు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్‌హెచ్, ఈసీ, నకలు వంటి కాపీలను రైతులకు సకాలంలో అందించేందుకు అన్ని చర్యలు తీసుకొంటామని అన్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

ముదిగుబ్బ, సెప్టెంబరు 24: మండలంలోని పి కొట్టాల సమీపంలో మద్దిలేరు వాగు వద్ద కోడిపందెలు ఆడుతున్న స్థావరంపై పట్నం పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. కోడిపందేలు ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేయడంతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి రూ.15,830 నగదు, రెండు కోళ్లు, 6 ఆరు కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు, పట్నం ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

ఇంకెన్నాళ్లు బురద కష్టాలు..?

పిల్లలను బయటికి పంపాలంటే భయం
ఏళ్ల తరబడి అడిగినా మారని దుస్థితి

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 24: పట్టణంలో నివసిస్తున్నామన్న మాటే కానీ.. నిత్యం మట్టి బురద మట్టిలో భయం గుప్పిట్లో ప్రయాణం చేయాల్సి వస్తోందని హిందూపురం వాసులు వాపోతున్నారు. కొన్ని కాలనీల్లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్రవాహనాలు కాదుకదా కనీసం కాలి నడకన నడిచి వెళ్లలేని పరిస్థితి దాపురించింది. సోమవారం రాత్రి హిందూపురం ప్రాంతలో కురిసిన వర్షానికి లక్ష్మీపురం, డీఆర్ కాలనీ, రంగప్ప లే ఆవుట్, రాజరాజేశ్వరీ కాలనీ, హౌసింగ్ బోర్డు, టీచర్స్ కాలనీ తదితర చోట్ల రోడ్లు బురదమయమైపోయాయి. చాలా ఏళ్లుగా రోడ్డు, డ్రైన్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపైకి వదిలేస్తున్నారు. దీంతో వర్షం వచ్చిందంటే మురుగునీరు కలిసిపోయి దుర్గంధ భరితమైపోతోంది. అసలే వర్షాకాలం కావడంతో మురుగునీరు నిలువ ఉండిపోయి దుర్వాసన రావడమే కాకుండా దోమలకు నిలయంగా మారిపోయి పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కటంటే ఒక్క రోడ్డు కూడా వేయలేదని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఎక్కడి డ్రైన్లు అక్కడే ఉండిపోయాయంటున్నారు. పన్నులు మాత్రం ఆటోల్లో మైకులు పెట్టి మరి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. అన్ని ట్యాక్సులు సక్రమంగా కడుతున్నా కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయకపోతే ఎలా అని మండిపడుతున్నారు. సచివాలయాల్లో ఫిర్యాదు చేశామని, కౌన్సిలర్లకు తెలిపామని, అధికారుల దృష్టికి కూడా తమ పరిస్థితి తీసుకెళ్లామని ఆగ్రహించారు. ఇప్పటికైనా స్పందించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.



లక్ష్మీపురంలో బురదమయమైన దారి

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



వర్షం వచ్చిన ప్రతిసారి రోడ్లు బురదమయమవుతున్నాయి. 10వ వార్డు సచివాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇంతకు ముందు నీటి పైపులు తీశారు. గుంతలు పూడ్చాలని తెలిపాం. డెవలప్‌మెంట్ వర్కులు చేసినపుడు సరిచేస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఈ ప్రాంత వాసులు తలా కొంత వేసుకొని కొంత వరకు చక్కదిద్దుకున్నాం. కౌన్సిలర్, అధికారులు స్పందించాలి.

- శ్రావణిబాయి, లక్ష్మీపురం

దోమల బెడద ఎక్కువగా ఉంది



రోడ్డు బురదమయమైపోయి నీరు నిలువ ఉండిపోతోంది. దీంతో దోమలకు నిలయంగా మారుతున్నాయి. పిచ్చి మొక్కలు ఎక్కడ చూసినా ఏపుగా పెరిగి పోయాయి. దీంతో దోమలు ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

- భోజరాజు, లక్ష్మీపురం

సాగులో మెలకువలు పాటించండి

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి సురేంద్రనాయక్ అన్నారు. మంగళవారం చలివెందుల, బాలంపల్లి గ్రామాల వద్ద 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయాధికారులు సూచించిన మేరకు పంటను సాగుచేస్తే పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఎక్కువ మోతాదులో రసాయన మందులు వాడకుండా సేంద్రీయ పంటను సాగుచేయాలన్నారు. రొద్దం మండంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ, పట్టుపరిశ్రమశాఖ అధికారులు తురకలాపట్నం, రెడ్డిపల్లి గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ నివేదిత, పట్టు పరిశ్రమశాఖాధికారి రాజేశ్వరి, ఆర్బీకే కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. పంట సాగు చేసే రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా పాటించాలని పెనుకొండ ఏఓ చందన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, మునిమడుగు వెంకటరాముడు, వ్యవసాయ విస్తరణాధికారి అశోక్‌కుమార్ పాల్గొన్నారు. లేపాక్షి మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ సిబ్బంది విజయవంతం చేయాలన్నారు. చిలమత్తూరు మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి వంశీకృష్ణ పలు సూచనలు చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారి పురుషోత్తంరెడ్డి జీవాలకు గాలికుంట వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిగి మండలంలోని కె. నర్సాపురం, ధనాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. మడకశిర మండలంలో ఏఓ తిమ్మప్ప ఆధ్వర్యంలో సీ కోడిగేపల్లి, బుళ్ళసముద్రం పంచాయితీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అగళి మండలంలో జడ్పీటీసీ ఉమేష్ ఏఓ శేఖర్ నాయక్, జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, ఏఈఓ దాక్షాయిని, మారతమ్మ, చంద్రకుమార్, నాగరాజు, వెటర్నరి, శివకుమార్ పాల్గొన్నారు. అమరాపురంలో వ్యవసాయ అధికారి మంజునాథ్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు జయకుమార్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి పాల్గొన్నారు.



హిందూపురంలో మట్టినమూనా పత్రాన్ని అందజేస్తున్న ఏఓ

చంద్రబాబుతోనే పేదల సంక్షేమం : ఎమ్మెల్యే

గుడిబండ, సెప్టెంబరు 24 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే ప్రజా సంక్షేమాభివృద్ధి సాధ్యమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ముదుకూరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. మడకశిరలో ఎన్నో ఏళ్ల నుంచి నిలిచిపోయిన పనులు కూడా అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించామన్నారు. మడకశిరలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీ ఉలవలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు దుర్గేష్, లక్ష్మీనరసప్ప, భీమరాజు, ప్రకాశ్, ఏఓ వీరనరేష్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

విద్యతోపాటు క్రీడలూ అవసరం : ఎమ్మెల్యే

మడకశిరటౌన్: ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. మంగళవారం మడకశిర జూనియర్ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతంగా ఉండేందుకు దోహదం చేస్తాయన్నారు. గెలుపు ఓటములు సహజమేనని, ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తితో ఆటల పోటీలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

పావగడ, సెప్టెంబరు 24 : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన రాజు (28) అనే యువకుడు మృతి చెందగా, రొద్దంకు చెందిన మారుతిప్రసాద్ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రొద్దం గ్రామానికి చెందిన మారుతిప్రసాద్ పావగడ తాలూకా కడుపులచెరువు గ్రామంలో వారం క్రితం వివాహం చేసుకోగా సోమవారం రాత్రి భార్య ఊరికి వచ్చి మంగళవారం సాయంత్రం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. పట్టణ సమీపంలోని టీఎంపేట దగ్గర రొద్దం నుంచి వస్తున్న రాజు, మారుతి బైకులు తీవ్రంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందగా మారుతిప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. మారుతిని పావగడ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం తుమకూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురునాథ్ తెలిపారు.

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 24 : మండల కేంద్రంలోని సాయినగర్, సప్తగిరి కాలనీ, పందిపర్తి గ్రామాల్లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గోడలకు ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశ్వర్థ, కిష్టప్ప, మూర్తి, భాను, చలపతి, మూర్తి, వెంకటేశులు, మారుతి, వెంకటరమణ, అజయ్, రత్నమ్మ, బీజేపీ నాయకుడు నాగప్ప పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి మారుపూజ

ధర్మవరంరూరల్: మండలంలోని కుణుతూరు గ్రామంలో నూతన ఆలయంలో గంగమ్మ తల్లిని ప్రతిష్ఠించి 40 రోజులు అయిన సందర్భంగా మంగళవారం మారు పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం సమర్పించారు.

క్వారీని పరిశీలించిన సీఐ

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 24 : మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లి చెరువు సమీపంలో వేలుపుకొండపై చేపడుతున్న క్వారీని మంగళవారం సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఇటీవల మంత్రి సవిత మండల పర్యటనలో భాగంగా నాగినాయనిచెరువుతండా ప్రజలు, కేజీబీవీ విద్యార్థులు, ఇరిగేషన్ సిబ్బంది క్వారీపై ఆమెకు ఫిర్యాదు చేశారు. ఆ క్వారీని రద్దు చేయాలని కోరారు. ఈ క్రమంలో పరిస్థితిని సమీక్షించేందుకు సీఐ క్వారీవద్దకు వెళ్లి పనులు పరిశీలించారు. ఆ క్వారీలో పేలుళ్లవల్ల చెరువు నీరు కలుషితం కావడంతోపాటు నాగినాయనిచెరువు పొలాల్లో దుమ్ము పేరుకుపోయి బీడుగా మారడం, గృహాలు బీటలువారడం, పేలుళ్ల శబ్దాలకు విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. క్వారీవల్ల తమ ఇలవేల్పు అక్కమ్మగార్లకు ముప్పు పొంచి ఉందని పలువురు ఆయనకు విన్నవించారు. అనంతరం క్వారీ యజమానులతో కలిసిన ఆయన క్వారీకి ఉన్న అనుమతులు, ఇతరాత్ర విషయాలపై ఆరాతీశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని అక్కడ రికార్డులు పరిశీలించారు.



క్వారీని పరిశీలిస్తున్న సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్

లబ్ధిదారుల బియ్యం కాజేయడం నేరం: కలెక్టర్

బెళుగుప్ప, సెప్టెంబరు 24: లబ్ధిదారుల బియ్యం కాజేయడం నేరం, సీఎస్ డీటీతో విచారణ చేయించి నివేదిక పంపాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తహసీల్దార్ షర్మిలను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ హనకనహళ్ వెళుతూ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దన్న, టీడీపీ నాయకులు పెద్దతిప్పయ్య, మల్లికార్జున కలెక్టర్‌కు సమస్యలు విన్నవించారు. రేషన్-2 డీలర్ లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా లాగిన్ వేయించి స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. సబ్సిడీపై పప్పుశనగ విత్తనాల పంపిణీ చేయాలని కోరారు. కార్యాలయం ఉండటానికి అనుకూలంగా లేదని, పీహెచ్‌సీకి నూతన భవనం నిర్మించడంతో పాత అస్పత్రి భవనం వృథాగా ఉంది. అందులోకి కార్యాలయ మార్పునకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది కోరారు. మీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీడీవో రామచంద్ర, డీటీ హంసేన్ పీరా, ఆర్ఐ నగేష్‌లు వున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పేద కుటుంబానికి ఇల్లు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన ఎమ్మెల్యే
రూ.20వేల ఆర్థిక సాయం



కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, స్థానిక నాయకులు

మడకశిర/మడకశిరరూరల్ సెప్టెంబరు 24 : బాత్‌రూంలో నివాసం ఉంటున్న పేద కుటుంబానికి బుధవారం కలెక్టర్ చేతన్ ఇల్లు మంజూరు చేశారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో 'వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. బాత్‌రూంలో నివాసం!' అన్న శీర్షికతో ప్రచురించిన కథనానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్పందించి వెంటనే హెచ్‌ఆర్ పాళ్యం గ్రామానికి వెళ్లి బాధితుడు నరసింహప్ప కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. పేదలకు అండగా ఉంటామని, వారిని అన్ని విధాలా ఆదుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు తాము ముందుంటామని అన్నారు. ఏడు సంవత్సరాల నుంచి ఇల్లు లేదని, గత వైసీపీ ప్రభుత్వంలో గడప గడప కార్యక్రమంలో ఇంటి నిర్మాణం చేసి ఇస్తామని భరోసా ఇచ్చారని, అయినా విస్మరించి ఐదేళ్లలో తమకు ఎలాంటి సహాయం అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే ఫోన్ ద్వారా సమస్యను కలెక్టర్ చేతన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ వెంటనే నరసింహప్పకు ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారని ఎమ్మెల్యే అన్నారు. వెంటనే బాధితులకు తక్షణ సహాయంగా రూ.20వేలు సొంతంగా ఆర్థిక సహాయం అందించారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు బాడుగ ఇంటిలో ఉండాలని, అందుకు సంబంధించిన బాడుగను ప్రతి నెలా తానే చెల్లిస్తానని తెలిపారు. తమ సమస్యను తెలియజేసిన ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

హిందూపురం, సెప్టెంబరు 24 : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ నాయకులు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలువార్డుల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తూ వచ్చామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి సంక్షేమం మూలానపడిందన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని వ్యవస్థలు చక్కదిద్దే పనిలో పడ్డారన్నారు. వైసీపీ కాలంలో రాష్ట్రాన్ని అన్నివిధాలా సర్వనాశనం చేశారన్నారు. తన అనుభవంతో చంద్రబాబు ఒక్కొక్కటే చక్కదిద్దుతూ ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం అందిస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు రమేష్, కౌన్సిలర్ అయాజ్, నాయకులు అంజాద్, నబీరసూల్, అమర్నాథ్, పరిమల, వెంకటలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ నగర్‌లో నాయకులు జయసింహ తదితరులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమంపై వివరించారు.



ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

సేవా గుణాన్ని అలవరచుకోవాలి

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 24: విద్యార్థులు చదువుతోపాటు సేవా గుణాన్ని అలవరుచుకోవాలని బాలయేసు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జియావుల్లా పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సేవాపథకం దినోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుకునే స్థాయిలోనే సమాజ సేవకు అలవాటు పడాలని, ఇందుకు ఎన్ఎస్ఎస్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ అశ్వర్థనారాయణ, హరీష్, అధ్యాపకులు శివరామిరెడ్డి, సుందరేష్, తన్వీర్ విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా ఎస్‌డిజీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఎంబీఏ ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రాజన్న మాట్లాడుతూ విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు.

గోరంట్ల : చిన్నప్పటి నుంచి ప్రతి విద్యార్థి సేవా భావం, క్రమశిక్షణతో మెలగాలని ఎస్‌పీఎస్ ఎయిడ్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ తెలిపారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లోనే కాకుండా ఉపద్రవాలు, వరద ప్రాంతాలకెళ్లి సేవలు అందించాలన్నారు.

పెనుకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సేవా దృక్పథాన్ని విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ శంకర్‌నాయక్, శ్రీలేఖ అధ్యాపకులు మూర్తి, శ్రీకళ, సుశీలభాయి, స్రవంతి సుధారాణి, వలంటీర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి : ఏఐఎస్ఎఫ్



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 24: జిల్లాలోనే పెద్ద పట్టణమైన హిందూపురంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూపురంలో బాలురకు ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ జూనియర్ కళాశాలలు లేకపోవడంతో ప్రైవేట్ కళాశాలల్లో చదివించలేక చాలా మంది మధ్యలోనే వదిలేస్తున్నారని అన్నారు. కొంత మంది కార్మికులుగా, కూలీలుగా బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్తున్నారని తెలిపారు. హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. పాతబడిన హాస్టల్ భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చినప్పటికీ విద్యాశాఖ అధికారులు వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియోజక వర్గ అధ్యక్షుడిగా దేవరాజ్, ఉపాధ్యక్షులుగా మహేష్, అమీన్, నూర్, వసంత్, ప్రధాన కార్యదర్శిగా నరసింహ మూర్తి, సహాయ కార్యదర్శులుగా గోపి, అశోక్, వెంకటేష్, జావిద్, కోశాధికారిగా పవన్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయండి

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 24

మండల కేంద్రం పరిగిలో వడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని పలువురు వడ్డెర కులస్థులు మంగళవారం సచివాలయ కార్యదర్శి అరుణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సాధికార సమితి సభ్యులు హనుమయ్య, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.